క్లుప్తంగా

ఆంజనేయస్వామి ఆలయానికి విరాళాలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బాయమ్మతోటలో ఉన్న సంజీవరాయ ఆంజనేయస్వామి దేవాలయానికి విరాళాలు మంగళవారం అందించారు. ఆలయ అభివృద్ధికి విశ్వజయం గ్రూప్ సభ్యులు బలభద్రుని లక్ష్మణమూర్తి, సుబ్బలక్ష్మి దంపతులు రూ.10వేలు, విశాఖకు చెందిన బత్తుల కాళిదాసు, సత్యవతి దంపతులు రూ.15వేలు విరాళాలను ఆలయ నిర్వాహకులు కాశిని వేంకటేశ్వరరావుకు అందించారు. ముందుగా ఆలయ అర్చకులు బంకుపల్లి గీతా శర్మ స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. పూర్ణచంద్రదాస్, ఎ.శేషగిరి, ఎం.వెంకటరమణ, వి.జగదీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు


పూజలు అందుకుంటున్న సుబ్రహ్మణ్యస్వామి

శ్రీకాకుళం కల్చరల్: పట్టణంలోని నక్కవీధిలో గల ఉమాజఠలేశ్వరస్వామి ఆలయంలో ఉన్న వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో మంగళవారం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం స్వామికి ప్రీతికరమైన రోజుకావడంతో అధిక సంఖ్యలో భక్తులు వచ్చి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు.

అంగన్‌వాడీ కేంద్రం సందర్శన


కేంద్రాన్ని పరిశీలిస్తున్న దృశ్యం


ఎచ్చెర్ల క్యాంపస్: నిబంధనల మేరకు అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహించాలని ఎస్‌ఎం పురం ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి డోల పాపినాయుడు అన్నారు. సంతసీతారాంపురం పంచాయతీ నందిగాం అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. పిల్లల హాజరు, ఆహారంలో మెనూ పరిశీలించారు. పిల్లల సంఖ్య పెరిగేలా కృషిచేయాలని సిబ్బందికి సూచించారు.

వరి విత్తనాల రిజిస్ట్రేషన్ ప్రారంభం


రిజిస్ట్రేషన్‌ను పరిశీలస్తున్న విజయభాస్కర్

రణస్థలం: రైతు భరోసా కేంద్రాల ద్వారా వరి విత్తనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైనట్లు రణస్థలం వ్యవసాయాధికారి ఎ.విజయభాస్కర్ తెలిపారు. పాతర్లపల్లి రైతు భరోసా కేంద్రంలో విత్తనాలు కావాల్సిన రైతులకు మంగళవారం బయోమెట్రిక్ వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్‌బీకేల్లో ఎంటీయూ 1121 రకం విత్తనాలు అందుబాటులో ఉన్నట్టు చెప్పారు. రైతులందరూ ఆధార్ కార్డు, 1-బి, ఫోన్ నంబర్‌తో ఆర్‌బీకేలో సంప్రదిస్తే సరిపోతోందన్నారు.

విత్తనాలు వేసే విధానంపై అవగాహన


రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

లావేరు: సీడ్ డ్రిల్ యంత్రం ద్వారా విత్తనాలు వేస్తే పెట్టుబడి ఆదా అవుతుందని ఏఎంసీ మాజీ డైరెక్టరు లుకలాపు అప్పలనాయుడు అన్నారు. లుకలాపుపేట గ్రామంలో రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సీడ్ డ్రిల్ యంత్రం ద్వారా విత్తనాలు వేసే విధానంపై రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. యంత్రాల వినియోగంతో కూలీల సమస్యను అధిగమించవచ్చునన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌ఏ బి.సత్యం, వైఎస్సార్‌సీపీ నాయకులు జగ్గురోతు రాము, గొర్లె సూర్యనారాయణ, పతివాడు గురునాయుడు పాల్గొన్నారు.

అన్నపూర్ణ పథకానికి రూ.10 వేల విరాళం

శ్రీకాకుళం కల్చరల్: రిమ్స్‌లోని అన్నపూర్ణ అన్నదాన సేవా పథకానికి మంతా అన్నపూర్ణ, విశాలాక్షి రూ.10 వేలు విరాళంగా అందించారు. రిమ్స్ కమిటీ జాయింట్ కార్యదర్శి కిల్లాన ఫల్గుణరావుకు ఈ మొత్తం అందజేశారు. హయాతినగరం భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే సుస్థిర అభివృద్ధి


లబ్ధిదారులతో మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ప్రజలు తనను గౌరవిస్తూనే ఉన్నారని, ప్రజల తరపున తమ గొంతెత్తూనే ఉంటానని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలోనే సుస్థిర అభివృద్ధి సాధ్యమైందని, ప్రజల జీవన ప్రమాణాల పెరుగుదలకు ఇప్పుడు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే ప్రధాన కారణమని మంత్రి అన్నారు. శ్రీకాకుళం నగరంలో హౌసింగ్ బోర్డ్ కాలనీ సచివాలయం పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 'గడిచిన 75 ఏళ్లలో ఇలాంటి ప్రభుత్వాన్ని ఎన్నడూ చూసి ఉండం .....ఎన్నికలైన తర్వాత ప్రజల మధ్య తిరుగుతూ వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తూ, నాటి పాదయాత్రలో ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కిందన్నారు. పాదయాత్రలో సీఎం జగన్ చెప్పిన విధంగా అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలోనే అన్నింటినీ నెరవేర్చారన్నారు. దేశంలోనే మ్యానిఫెస్టోను పూర్తి స్థాయిలో అమలు చేసిన ఏకైక పార్టీ వైఎస్సార్‌సీపీయే అని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రతి కుటుంబానికీ ప్రభుత్వ పథకం అందాలంటే లంచాలు ఇచ్చే వాళ్ళు.... బ్రోకర్లకు డబ్బులు ముట్టజెప్పనిదే పనులైన దాఖలాలేవన్నారు. ఆ రోజు టీడీపీ సర్కారులో జన్మభూమి కమిటీల పేరిట బ్రోకర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరించేవారన్నారు. కానీ ఇప్పుడు మధ్యవర్తుల ప్రమేయమన్నది లేకుండా పాలన అందించడం సుసాధ్యం అయిందన్నారు. నేరుగా ప్రభుత్వ పథకాల ద్వారా అందే ఆర్థిక లబ్ధిని బ్యాంక్ అకౌంట్లకు జమ చేయడంతో ఇది సాధ్యమైందన్నారు. పరిపాలనలో స్వచ్ఛమైన మార్పు అంటే ఇది. గతంలో చిన్న పనికి కూడా మండల, మున్సిపల్ కార్యాలయాలకు వెళ్లి రోజుల తరబడి సమయం వెచ్చించి సంబంధిత అధికారుల చుట్టూ కాళ్లు అరిగేలా ప్రదక్షిణలు చేసేవారన్నారు. ఇప్పుడు మీ వీధిలో, మీ గ్రామంలో స్థానికంగా పాలన అందించేందుకు అధికార వ్యవస్థను అందుబాటులో ఉంచేందుకు సచివాలయాలను తీసుకువచ్చామన్నారు. విద్యా వ్యవస్థలో మార్పులు సీఎం జగన్ వల్లే సాధ్యమయ్యాయన్నారు. స్కూల్ తెరిచిన మొదటి రోజునే జగనన్న విద్యా కానుక పేరిట తొమ్మిది వస్తువులతో కూడిన కిట్ ఇచ్చి మనసున్న సీఎంగా పేరు సంపాదించుకున్నారన్నారు. ఇక్కడి స్థానికులు తమ వీధికి డ్రైనేజీ, సీసీరోడ్డు నిర్మించాలని అడిగారు. మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేశును ఈ పనులు వెంటనే చేపట్టాలని ఆదేశించాను. యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు, కళింగ కోమటి కార్పొరేషన్ చైర్మన్ అందవరపు సూరిబాబు, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు మెంటాడ స్వరూప్, మాజీ మున్సిపల్ చైర్మన్ మెంటాడ పద్మావతి, వార్డు ఇన్‌చార్జి నక్క రామరాజు, చల్ల అలివేలు మంగ, ఎన్ని ధనుంజయ్, మండవిల్లి రవి, రుప్ప గిరి, వి.నాగరాజు, ఎం.ఏ.రఫీ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబువి దిగజారుడు రాజకీయాలు


ప్రజలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

- ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్
- చిలకపాలెంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

ఎచ్చెర్ల క్యాంపస్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజాక్షేత్రంలో ఎదుర్కోలేక ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ విమర్శించారు. చిలకపాలెం గ్రామ సచివాలయం పరిధిలో మంగళవారం ఉదయం, సాయంత్రం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాలు వివరించారు. రేషన్‌కార్డు వారీగా లబ్ధిదారులకు అందిన ప్రభుత్వ పథకాల వివరాలతో కూడిన బ్రోచర్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చంద్రబాబు రాజకీయ జీవితంలో నిజాయితీ, నిబద్ధత ఉండదన్నారు. వెన్నుపోటు ద్వారా సీఎం ఆయన వ్యక్తి తన స్వార్థ ప్రయోజనాల కోసం ఎంతటి స్థాయికైనా దిగజారుతారన్నారు. గతంలో తెలంగాణలో కాంగ్రెస్‌తో పొత్తుపెట్టుకున్న చంద్రబాబు ప్రస్తుతం బీజేపీ, జనసేనలతో కలిసి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారన్నారు. ఒంటరిగా పోటీ చేసే సత్తా టీడీపీకి, దత్తపుత్రుడు పార్టీ జనసేనకు లేదని ఎమ్మెల్యే వ్యాఖ్యానించారు. ఇటువంటి నాయకులను ప్రజలు నమ్మరని.. 2024లో జరగనున్న ఎన్నికలే చంద్రబాబుకు చివరివన్నారు. దిగజారుడు రాజకీయాలు, విలువల్లేని పొత్తులను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. దేశంలో ఆదర్శ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి పట్టం కట్టేందుకు ప్రజలు మరోసారి సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మొదలవలస చిరంజీవి, తహసీల్దార్ వై.సత్యనారాయణ, ఎంపీడీవో రమాదేవి, పీఏసీఎస్ అధ్యక్షుడు సనపల నారాయణరావు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు మాడుగుల మురళీధర్‌బాబా, జేసీఎస్ ఇన్‌చార్జి మూగి శ్రీరాములు, సర్పంచ్ డొంక ఆదిలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు రోజారాణి, స్థానిక నాయకులు డొంక వెంకట రమణ, ఎ.వెంకునాయుడు, చిలక సన్యాసప్పడు, డొంక శ్రీను పాల్గొన్నారు.

సకాలంలో నాట్లు వేస్తే అధిక దిగుబడులు


ఫెర్టి కమ్ సీడ్ డ్రిల్ యంత్రం పనితీరు పరిశీలిస్తున్న వ్యవసాధికారులు

రణస్థలం: వరినాట్లు సకాలంలో వేసినప్పుడే అధిక దిగుబడులు సాధ్యమవుతాయని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ డిప్యూటీ మేనేజర్ ఆర్.హరిబాబు అన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో రణస్థలం, లావేరు మండలాల్లోని వివిధ గ్రామాల్లో ఎరువులు, విత్తనాలు ఒకేసారి వేసే (ఫెర్టి కమ్ సీడ్ డ్రిల్) యంత్రంతో జరుగుతున్న పనులను క్షేత్రస్థాయిలో మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో వర్షాధారంగా లభిస్తున్న తక్కువ నీటితో లాభదాయక దిగుబడులు సాధించాలంటే వరి సాగును యంత్రాలతో చేయవలసిన అవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఏరియా మేనేజర్ పి.తవిటినాయుడు, సమన్వయకర్తలు ఆర్.కృష్ణ, ఎం.గణేష్ పాల్గొన్నారు.

జగనన్న గోరుముద్ద పరిశీలన

జి.సిగడాం: వాండ్రంగి పాఠశాలలో జగనన్న గోరుముద్ద పథకాన్ని సర్పంచ్ సాకేటి నాగరాజు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు బూరాడ వెంకటరమణ మంగళవారం పరిశీలించారు. ప్రభుత్వం నిబంధనాల మేరకే మెను అమలు చేయాలని నిర్వాహకులకు సూచించారు.

అమ్మవారికి సారె సమర్పణ


అమ్మవారి సారె ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

శ్రీకాకుళం కల్చరల్: నానుబాలవీధిలో గల విజయదుర్గ అమ్మవారి ఆలయంలో రాజశ్యామలా యాగంలో భాగంగా మంగళవారం అమ్మవారికి సారె, గోపూజా కార్యక్రమం నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆరవెల్లి సూర్యనారాయణ శర్మ, ఫణికుమార్ శర్మ ఆధ్వర్యంలో పూజలు చేపట్టారు. అనంతరం మహిళలు అమ్మవారి సారెను ఊరేగింపు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రాథమిక విద్యపై అవగాహన

ఎచ్చెర్ల క్యాంపస్: చిన్నారుల విద్యా వికాసానికి అంగన్‌వాడీ కేంద్రాలు తోడ్పాటు అందిస్తున్నాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శరణ్య అన్నారు. ఎచ్చెర్లలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం జనభగీదారీ కార్యక్రమాన్ని నిర్వహించి పూర్వ ప్రాథమిక విద్యపై అవగాహన కల్పించారు. ఆరేళ్లలోపు పిల్లను అంగన్‌వాడీల్లో చేర్పించాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు శారద, పుష్ప పాల్గొన్నారు.

అర్హులందరికీ 'ఉపాధి' కల్పిస్తాం

గార: ఉపాధి హామీ పనులు అర్హులందరికీ కల్పించేందుకు తక్షణమే చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ సంజీవ రమణయ్య అన్నారు. సతివాడ పంచాయతీ నుంచి మస్టర్‌లో నా పేరు రావడం లేదని, దాంతో ఉపాధి పనికి వెళ్లలేకపోతున్నానని 1902కు పి.రాజారావు ఫిర్యాదు చేశారు. దీనిపై సతివాడలో జరుగుతున్న పనుల వద్దకు ఏపీఓ సంధ్యారాణి, నారంనాయుడుతో కలిసి వెళ్లి తనిఖీ చేపట్టారు. తక్షణమే మస్టర్‌లో పేరు నమోదు చేయించి మంగళవారం నుంచి పని కల్పించారు.

విద్యకు నాంది అంగన్‌వాడీ కేంద్రాలు


పాతగూనపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

శ్రీకాకుళం అర్బన్: చిన్నారుల విద్యకు నాంది అంగన్‌వాడీ కేంద్రాలని, చిన్నారుల ప్రతిభను వెలికితీసేందుకు అంగన్‌వాడీ కేంద్రాలు ఎంతో దోహదపడతాయని గూనపాలెం అంగన్‌వాడీ టీచర్ టి.సుజాత అన్నారు. ప్రపంచ బాలకార్మికుల నిర్మూలనా దినోత్సవాన్ని పురస్కరించుకుని గూనపాలెం అంగన్‌వాడీ కేంద్రం వద్ద మంగళవారం జన్‌భగీదారి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలన్నారు. పెరిగిన చిన్నారులకు పనికి పంపించకుండా ప్రభుత్వ స్కూళ్లకు పంపించాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలు పాతగూనపాలెం వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు బి.ఆదిలక్ష్మి, హెల్పర్లు కె.నాగమణి, జె.పావని, ఆశ వర్కర్ ఎం.అమ్మాజీ, చిన్నారులు పాల్గొన్నారు.

అధిక మార్కులు సాధిస్తే నగదు పారితోషికం


విద్యార్థులకు నగదు పారితోషకం అందజేస్తున్న దృశ్యం

లావేరు: పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించిన వారికి ప్రభుత్వం నగదు పారితోషికం అందజేస్తోందని లావేరు హైస్కూల్ హెచ్‌ఎం పి.జగన్నాథరావు అన్నారు. లావేరు హైస్కూల్‌లో 2022-23 విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షలో హైస్కూల్ స్థాయిలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు రూ. 3 వేలు, 2 వేలు, వెయ్యి చొప్పున ప్రభుత్వం నగదు పారితోషకాలు ప్రకటించింది. ఈ మొత్తాన్ని ముగ్గురు విద్యార్థులకు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయుడు మీసాల శ్రీనివాసరావు, లావేరు సర్పంచ్ ఉర్లాపు లక్ష్మి, లావేరు-1, 2 ఎంపీటీసీ సభ్యులు డోకల రాధ, ఇనపకుర్తి సతీష్, ఏఎంసీ డైరెక్టరు లంకలపల్లి నారాయణరావు, నాయకులు ఎల్.గోపీ, ఎం.చక్రధర్, కె.త్రినాథరావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జేవీకే కిట్ల పంపిణీ


జి.సిగడాం పాఠశాలలో కానుకలను అందజేస్తున్న నాయకులు


జి.సిగడాం: బాతువలో కానుకలను అందజేస్తున్న దృశ్యం


లావేరు: విద్యార్థులకు కిట్లను అందజేస్తున్న దృశ్యం


ఎచ్చెర్ల క్యాంపస్: కిట్లను అందుకుంటున్న పిల్లలు

జి.సిగడాం: జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ రెండో రోజైన మంగళవారం కూడా పలు పాఠశాలల్లో ఉత్సాహంగా జరిగింది. జి.సిగడాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన కానుకల పంపిణీలో మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..విద్యతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరాడ వెంకటరమణ, ఎంఈఓ అరసాడ రవి, మండల జేసీఎస్ కన్వీనర్ డోల వెంకటరమణ, సర్పంచ్ ముద్దాడ ఈశ్వరమ్మ, ప్రధానోపాధ్యాయుడు నర్సింహంమూర్తి, మొయ్యి జనార్దనరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు మహాదాస్యం నారాయణరావు, ముద్దాడ గౌరీ, కీర్తి సత్యం, పెద్ది శ్రీనివాసరావు, చిక్కాల ధర్మారావు పాల్గొన్నారు. బాతువ ఎంపీపీ పాఠశాలలో కూడా కానుకలను విద్యార్థులకు పంపిణీ చేశారు.

లావేరు: లావేరు హైస్కూల్ విద్యార్థులకు సర్పంచ్ ఉర్లాపు లక్ష్మి, లావేరు-1, 2 ఎంపీటీసీ సభ్యులు డోకల రాధ, ఇనపకుర్తి సతీష్ జేవీకే కిట్లను పంపిణీ చేశారు. హెచ్‌ఎం పి.జగన్నాథరావు, సీనియర్ ఉపాధ్యాయుడు మీసాల శ్రీనివాసరావు, పీడీ రవికుమార్, ఏఎంసీ డైరెక్టరు లంకపల్లి నారాయణరావు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల క్యాంపస్: అజ్జరాం పంచాయతీ గొల్లవానిపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను అందజేశారు. డీసీఎంఎస్ మాజీ ఉపాధ్యక్షుడు బోర సాయిరాం, సర్పంచ్ సుగ్గు శ్రవంతి, ఎంపీటీసీ సభ్యుడు బోర గోవింద రెడ్డి పాల్గొన్నారు.

సివిల్స్ విజేతకు అభినందనలు వెల్లువ


చల్ల కల్యాణిని అభినందిస్తున్న ఎంపీపీ రఘురామ్

శ్రీకాకుళం రూరల్/గార: శ్రీకాకుళం రూరల్ మండలం వప్పంగి గ్రామానికి చెందిన సివిల్స్ విజేత చల్ల కల్యాణికి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. గార ఎంపీపీ, రాష్ట్ర అగ్రిమిషన్ సభ్యుడు గొండు రఘురామ్ కల్యాణిని మంగళవారం అభినందించారు. రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ ముంజేటి కృష్ణమూర్తి, సర్పంచ్‌లు గొలివి వెంకటరమణమూర్తి, పీస గోపి, అంబటి చిన బాబు, శిమ్మ ధర్మరాజు, గొల్లంగి వెంకటేశ్వర్లు, పెద్దిన ఉమామహేశ్వరరావు, శీర సత్యం మాస్టారు, శిమ్మ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

శివారు భూములకు సాగునీరు అందించాలని వినతి


డీఈ మురళీమోహన్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఖరీఫ్ సీజన్‌లో నారాయణపురం కుడికాలువ కింద ఉన్న మండలంలోని శివారు భూములకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ మొదలవలస చిరంజీవి, స్థానిక నాయకులు కోరారు. ఈ మేరకు శ్రీకాకుళంలోని నీటి పారుదల శాఖ కార్యాలయంలో డీఈ ఎం.మురళీమోహన్‌ను మంగళవారం కలిసి వినతి పత్రం అందజేశారు. తోటపాలెం, కొత్తపేట, ముద్దాడ, ధర్మవరం, భగీరథపురం, బొంతలకోడూరు, కొంగరాం తదితర గ్రామాల్లోని శివారు ఆయకట్టుకు సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. డీఈ మాట్లాడుతూ సజావుగా నీరు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నాయకులు సక్క కృష్ణమూర్తి, బెండు రామారావు, అల్లు సూర్యనారాయణ ఎంపీపీతో ఉన్నారు.

ఆ నేత్రాలు సజీవం


నేత్ర సేకరణ చేస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకూర్మాంలో నివాసముంటున్న కె.నరసింహాచార్యులు (73) మంగళవారం సాయంత్రం మృతి చెందారు. అతని నేత్రాలను రెడ్‌క్రాస్ నేత్రసేకరణ కేంద్రానికి కుటుంబ సభ్యులు దానం చేశారు. ఈయన జిల్లా లోకల్ ఫండ్ జిల్లా అధికారిగా పనిచేసి పదవీ విరమణ చేశారు. అతని కుటుంబ సభ్యులు రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావుకు తెలుపగా..వారి అంగీకారం మేరకు ముగటపల్లి కల్యాణ్ నేత్రసేకరణ కేంద్రం ద్వారా అతని కార్నియాలను సేకరించారు.

ప్రత్యేక అలంకరణలో విజయగణపతి

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాలకొండ రోడ్డులో గల విజయగణపతి ఆలయంలో మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పెంట శ్రీధర్‌శర్మ, సూర్యనగేష్ శర్మల ఆధ్వర్యంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం


ఎమ్మెల్యే కిరణ్‌కుమార్‌ను సత్కరిస్తున్న ఉద్యోగులు

- ఎమ్మెల్యే కిరణ్‌ను సత్కరించిన కాంట్రాక్టు ఉద్యోగులు

రణస్థలం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటామని వైద్యారోగ్యశాఖ కాంట్రాక్టు ఉద్యోగులు అన్నారు. తమను రెగ్యులర్ చేసి 20 ఏళ్ల కలను సీఎం జగన్ నెరవేర్చడంపై హర్షం వ్యక్తం చేశారు. వైద్యారోగ్య శాఖ కాంట్రాక్ట్ ఉద్యోగుల సర్వీస్‌ను క్రమబద్ధీకరణ చేసిన సందర్భంగా మండల కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్‌ను రణస్థలం, లావేరు మండలాల ఉద్యోగులు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి దుశ్శాలువతో సన్మానించారు. సీఎం జగన్, ఎమ్మెల్యే కిరణ్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో రణస్థలం, లావేరు మండలాల వైద్యారోగ్యశాఖ యూనియన్ నాయకులు గురాన చిరంజీవి, డి.సాయిప్రసాద్, ఎస్.గోవిందరావు, సీహెచ్ చిన్నవాడు, ఎస్.అప్పలరాజు, డి.హరిప్రసాద్, పి.మన్మథరావు, ఎం.రాజమోహన్ ఆచారి ఉన్నారు.